క్లుప్తంగా

రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు



కంకిపాడు: రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దని, మెరుగైన వైద్యం అందేలా చూడాలని పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తుమ్మలపల్లి హరికృష్ణ పేర్కొన్నారు. కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాద బాధితుడికి వైద్యం సక్రమంగా అందడం లేదని గుర్తించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానన్నారు. సేవల్లో అలసత్వం వద్దని, సమర్థంగా పనిచేయాలని సూచించారు. సీహెచ్‌సీలోని పలు విభాగాల్లో అందుతున్న సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు.

ఆక్రమణల తొలగింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని డొంక రోడ్డులో ఆక్రమణలను తాడిగడప మున్సిపాలిటీ సిబ్బంది తొలగిస్తున్నారు. గత రెండు రోజులుగా డొంక రోడ్డులో ఉన్న ఆక్రమణలు తొలగించడానికి మున్సిపాలిటీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. వ్యాపారులు వారి దుకాణాల ఎదుట ఆక్రమించి స్టాల్స్ పెట్టి షెడ్లు వేయడంతో డొంక రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామ ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు పడటంతో తాడిగడప మున్సిపాలిటీ ఆక్రమణల తొలగింపు చేపట్టింది.

నిత్యావసరాల పంపిణీ



పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీరో పావర్టీ - పీ4లో భాగంగా తాడిగడప మున్సిపాలిటీలో పోరంకి 5వ సచివాలయం పరిధిలో 35 యానాదుల కుటుంబాలకు మంగళవారం నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.మురళీకిషోర్ మాట్లాడుతూ పేదరికం పోవాలంటే చిన్నారులు చదువుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పేదలు పేదరికం నుంచి బయటపడాలని సూచించారు. పీ4 దాత అనుమోలు ప్రభాకరరావు, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్, ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి, సచివాలయ, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

6న ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

గన్నవరం: స్థానిక యాదవుల రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వచ్చేనెల నాలుగు నుంచి ఆరవ తేదీ వరకు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న గోపూజ, గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, దీక్షాధారణ జరపనున్నట్లు పేర్కొన్నారు. 5న స్వామివారికి గ్రామోత్సవం, పలు హోమాలు, 6వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు దేవాలయ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం, అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

పెంటథ్లాన్ పోటీల ఓవరాల్ చాంపియన్ కృష్ణా



పెనమలూరు: రాష్ట్ర స్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణా జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిందని సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు నరేంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు తెలుపుతూ ఈ నెల 26, 27 తేదీల్లో పెనమలూరు బ్లూమింగ్ డెల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వివిధ వయస్సుల వారికి పోటీలు జరిగాయన్నారు. 26న టెట్రాథ్లాన్ పోటీల్లో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్ నిర్వహించామని చెప్పారు. 27న ట్రియాథిల్ పోటీల్లో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో కృష్ణా జిల్లా క్రీడాకారులు 27 పతకాలతో ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

పేరంటాలమ్మకు విశేష పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని నాగుల పంచమి సందర్భంగా వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవార్లకు పొంగలి సమర్పించారు. కుంకుమార్చన, అష్టోత్తర పూజలు చేశారు. నాగుల పంచమి సందర్భంగా భక్తులు పుట్టలో పాలు పోశారు.

కదలని మురుగు

- పూడికతీతకు నోచుకోని పంటకాలువ
- విష పురుగులు, దోమలకు ఆవాసంగా మారిన వైనం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జాతీయ రహదారిపై నుంచి నారాయణ కళాశాల మీదుగా వెళ్లే పంట కాలువ క్రమేణా పూడుకుపోతోంది. గత కొన్నేళ్ల నుంచి ఈ కాలువ పూడికతీతకు నోచుకోకపోవడంతో మురుగునీరు పారుదల ఉండటం లేదు. ఫలితంగా సమీప పొలాల్లోకి మురుగునీరు చేరుకుంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట కాలువలోని మురుగు ఎటూ పోయే మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ స్థలాల్లో చేరిన మురుగుతో కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయని చెబుతున్నారు. ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడం, మురుగునీరు నిల్వ ఉండి బురదమయంగా మారడంతో పలు సమస్యలకు తావిస్తోంది. ఈ పంట కాలువ సమీపంలోని కళాశాలలో వందల సంఖ్యలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పరిసర ప్రాంతంలో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పంట కాలువ మరింత దారుణంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తబరుస్తున్నారు. కాలువలో నీరు పారుదల లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



క్రమేణా పూడుకుపోతున్న పంట కాలువ



ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, నిలిచిన మురుగునీరు

నీటిపారుదలకు చర్యలు తీసుకోవాలి

గత ఏడాది బుడమేరు సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. బుడమేరు వరద తీవ్ర నష్టం మిగిల్చిందని రైతులు గుర్తు చేస్తున్నారు. కాలువలో నీరు సక్రమంగా పారుదల ఉంటే పొలాలు ముంపునకు గురి కాకుండా కాపాడుకోవచ్చని చెబుతున్నారు. ఈ పంట కాలువను పూడిక తీయించి మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగించాలని, మురుగు నిల్వ లేకుండా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు.

గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలి

జిల్లా హౌసింగ్ అధికారి పోతురాజు

ఉంగుటూరు(గన్నవరం): గృహ నిర్మాణాలను వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులను సమయాత్తం చేయాలని జిల్లా హౌసింగ్ అధికారి జి. పోతురాజు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం గృహ నిర్మాణాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ.. మండలంలో 501 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. సదరు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలు, రాయితీల గురించి అవగాహన కల్పించారు. తద్వారా గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ఈ. సత్యకుమార్, హౌసింగ్ డీఈఈ రమేష్‌బాబు, ఈఈ శివప్రసాద్, వెంకట్రావు, పలువురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పోతురాజుకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ

జేఆర్‌డీ టాటా సేవలు చిరస్మరణీయం

పెనమలూరు: భారతదేశానికి జేఆర్‌డీ టాటా అందించిన సేవలు చిరస్మరణీయమని ది విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి పేర్కొన్నారు. కానూరు జేఆర్‌డీ టాటా ఐలా సర్వీస్ సొసైటీలో మంగళవారం భారతరత్న జేఆర్‌డీ టాటా 121వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జేఆర్‌డీ టాటా చిత్రపటానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేఆర్‌డీ టాటా జీవిత చరిత్రకు సంబంధించి రూపొందించిన పుస్తకాన్ని తెలుగులోకి అశోక్‌బుక్స్ అధినేత అశోక్‌కుమార్ అనువదించగా దానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ జేఆర్‌డీ టాటా 1926వ సంవత్సరంలో టాటా గ్రూప్‌లో చేరారన్నారు. జేఆర్‌డీ టాటా జాన్‌కర్లోస్ కెనడీ పీటర్‌సన్ వద్ద శిక్షణ పొందారన్నారు. టాటా తండ్రి మరణానంతరం ఆయన టాటా సన్స్‌లో శాశ్వత డైరెక్టర్ హోదా లభించిందని తెలిపారు. జేఆర్‌డీ టాటా పారిశ్రామిక రంగంలో చేసిన సేవలతో భారతదేశం ప్రపంచంలోనే గుర్తింపు సాధించిందని వివరించారు. కార్యక్రమంలో జేఆర్డీ టాటా ఎస్టేట్ అధ్యక్షుడు టి.వినోద్‌బాబు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్తలు పి.రవికుమార్, జేఎస్‌ఆర్‌కే ప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, ఎ.నరసింహారావు, బోయిన వెంకట్రావు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




కానూరులో జేఆర్‌డీ టాటా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ ఇన్‌లైన్ టవర్ల నిర్మాణ పనుల నిమిత్తం కానుమోలు, రంగన్నగూడెం 132కేవీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో నున్న ఈఈ ఎస్. కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుణదల - కానుమోలు, గుణదల - రంగన్నగూడెం విద్యుత్ లైన్లలో ఎల్‌వోసీ నంబర్.205 వద్ద కొత్తగా ఇన్‌లైన్ టవర్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. దీని కారణంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైతేనే కానుమోలు, రంగన్నగూడెం 132కేవీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్లాట్లను ఆక్రమించిన వ్యక్తిపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: తమ ప్లాట్లను ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వీవీఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ బాధితులు మంగళవారం వీరవల్లి పోలీసులను ఆశ్రయించారు. పెద్ద ఎత్తున వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాధితులు హనుమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణకు కలిసి ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు. బాపులపాడు మండలం అంపాపురంలో వీవీఆర్ ప్యారడైజ్ పేరుతో వీవీఆర్ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో వందలాది మంది చిరు వ్యాపారులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇటీవల ఈ వెంచర్‌లోని ప్లాట్లను తేలప్రోలుకు చెందిన ఓ వ్యక్తి ధ్వంసం చేసి వ్యవసాయ భూమిగా మార్చారని వాపోయారు. ఆక్రమణదారుడి నుంచి తమ స్థలాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



వీరవల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట అంపాపురం వీవీఆర్ ప్యారడైజ్ బాధితులు

విద్యుత్ అగచాట్లకు సెలవు

గొడవర్రుకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడుకు కూతవేటు దూరంలో ఉన్న గొడవర్రు గ్రామం మేజర్ పంచాయతీల్లో ఒకటి. ప్రస్తుతం ఈ గ్రామానికి మద్దూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. సబ్‌స్టేషన్ పరిధిలో ఓవర్ లోడు, విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయాలు ఎదురవ్వడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికమించేందుకు విద్యుత్ శాఖ గొడవర్రులో ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు గానూ రూ.8 కోట్ల అంచనాతో పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు గ్రామంలోని సామాజిక స్థలం 25 సెంట్లు భూమిని అధికారులు గుర్తించారు. ఈ స్థలంలో త్వరలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే గృహ, వ్యవసాయ విద్యుత్‌తో పాటుగా గ్రామంలో ఉన్న పరిశ్రమలు, రైస్‌మిల్లులకు సైతం మెరుగ్గా విద్యుత్ సరఫరా అవుతుంది.

ఇబ్బందులకు ఊరట

మద్దూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకూ మద్దూరు, కాసరనేనివారిపాలెం, చోడవరం, చిన పులిపాక, వల్లూరుపాలెం, రొయ్యూరు, గొడవర్రు, బొడ్డపాడు, వణుకూరు, గోసాల, గోసాల శివారు వైకుంఠపురం గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలోని సుమారు 10 వేల విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరా మద్దూరు కేంద్రంగా జరగాల్సి ఉంది. మూడు ఫీడర్లు ఉంటే ఒక్కో ఫీడరు కింద 50 కిలోమీటర్లు పొడవైన విద్యుత్ లైన్లు ఉన్నాయి. దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సమస్యను గుర్తించి పరిష్కరించడం కష్టసాధ్యంగా మారింది. నూతనంగా ఏర్పాటు కానున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌తో ఈ సమస్యలు పరిష్కారం అవుతాయి.

గరుడ ఆళ్వార్‌కు అభిషేకాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం చినకంచిలో గరుడ పంచమి సందర్భంగా మంగళవారం గరుడ ఆళ్వార్‌కు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు శ్రావణ మంగళ గౌరీ వ్రతం ఆచరించారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకాలు జరిగాయి. అదేవిధంగా సుందర అభయ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

నున్నలో పారిశుద్ధ్య పనులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో డ్రెయినేజీ కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బంది తొలగిస్తున్నారు. అంతర్గత డ్రెయిన్లలో మురుగునీరు పారుదలతో అవుట్‌పాల్ డ్రెన్‌కు చేరుకుంటున్నాయి. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు: చిత్రలేఖనం పోటీల్లో పోరంకి విశ్రాంత ఉపాధ్యాయుడితో పాటు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 27వ తేదీన ప్రఖ్యాత భారతీయ ల్యాండ్‌స్కేప్ చిత్రకారుడు బీవీ భగీరథ 125వ జయంతి సందర్భంగా భగీరథ ఫౌండేషన్ ఆరవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు అరేపల్లి అప్పారావుకు ఆర్ట్ ఎక్స్‌పర్ట్ అవార్డు వచ్చింది. రాజమండ్రి ఏఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అప్పారావు అవార్డును అందుకున్నారు. అలాగే ఈ పోటీల్లో పాల్గొన్న పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.భార్గవి, వై.సంజన, సి.హెచ్.కావ్యలకు బంగారు పతకాలు వచ్చాయి. మరో 15 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు లభించాయి. వీరికి విశ్రాంత ఉపాధ్యాయుడు అప్పారావు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు.



ఏఎస్పీ మురళీకృష్ణ నుంచి అవార్డు అందుకుంటున్న అప్పారావు

ఖాళీగా ఉన్న 300 ఏఎస్‌ఓ పోస్టులు భర్తీ చేయాలి

ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా అర్థగణాంక శాఖలో ఖాళీగా ఉన్న 300 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్(అపెస్సా) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రజనీష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం అపెస్సా సర్వసభ్య సమావేశం అర్థగణాంక శాఖ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ 9 రూరల్ మండలాలు, 9 అర్బన్ మండలాలు మొత్తం 18 మండలాల్లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. రెవిన్యూ డివిజన్ నందు ఉపగణాంక అధికారి పోస్టును, గణాంక అధికారి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఏఎస్‌ఓ పేరు మండల ప్రణాళిక, గణాంకాధికారిగా మార్చాలని డిమాండ్ చేశారు. గణాంకాధికారికి గెజిటెడ్ హోదా కల్పించి ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈ సమస్యలను డైరెక్టర్ గోపాల్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అపెస్సా ప్రతినిధులు కె.చెంచురెడ్డి, ఏపీఎస్ నాయుడు, బీవీ మాధవి, సీహెచ్ నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రజనీష్‌బాబు

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

కంకిపాడు: పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్ శాఖ ఏడీ బి.నవీన్‌కుమార్ తెలిపారు. కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యుత్ బిల్లుల పెండింగ్‌పై సిబ్బందితో సమీక్ష చేశారు. బిల్లులు పెండింగ్ లేకుండా త్వరితగతిన వసూళ్లు చేయాలని ఆదేశించారు. కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ నవీన్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సర్వీసులు కంకిపాడు మండల పరిధిలో 2,500 ఉన్నాయన్నారు. వారందరికీ ఉచితంగా పీఎం సూర్యఘర్ వర్తింపచేయడం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ మెరుగ్గా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమీక్షలో ఇన్‌చార్జి ఏఈ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



కంకిపాడు సబ్‌స్టేషన్‌లో సమీక్ష చేస్తున్న విద్యుత్ శాఖ ఏడీ బి.నవీన్‌కుమార్

రైతులు పంటల బీమా చేసుకోవాలి

పెనమలూరు: రైతులు పీఎం ఫసల్ బీమా యోజన పథకం కింద పంటల బీమా చేయాలని జిల్లా వనరుల కేంద్ర అధికారిణి కె.జ్యోతి పేర్కొన్నారు. చోడవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసుపు రైతులు ఎకరాకు రూ. 1,100 బీమా ప్రీమియం ఈ నెలాఖరుకల్లా చెల్లించాలన్నారు. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు ఎకరాకు రూ. 830 ఆగస్టు 15 నాటికి కట్టాలని చెప్పారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు వారి పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. జీవ ఎరువులు, నానో ఎరువులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ వరి పొలం గట్లపై కందులు రైతులు సాగు చేయాలని సూచించారు. పంట పొలాల్లో అధికంగా నీరు ఉండకుండా రైతులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రైతులకు కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ కె.పావని, రైతులు పాల్గొన్నారు.



రైతులకు కందులు పంపిణీ చేస్తున్న అధికారులు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

పెనమలూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సుధాకర్ సూచించారు. యనమలకుదురు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే వారు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు తెలుపరాదన్నారు. అలాగే ఫోన్లలో వచ్చే తెలియని లింక్‌లు ఓపెన్ చేయకూడదని వివరించారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సుధాకర్

పీఎంశ్రీ పథకాన్ని సద్వినియోగించుకోవాలి

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ సూచించారు. పెనమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ 5వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పీఎంశ్రీ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పోరాటస్ఫూర్తితో ఉండాలని, స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీమ్యాట్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, ఏపీసీ కుముదిని, మండల విద్యాశాఖ అధికారులు శేషగిరిరావు, ఎం.కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు జీబీకే సుధారాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఖైరంబీ, సర్పంచి లింగాల భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీఎంశ్రీ పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్, జిల్లా అధికారులు